
సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం । 8 । ఆగస్టు । 2023



నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి వలసపాకలకు చెందిన కె.కోటేశ్వరరావు సోమవారం రూ.లక్ష విరాళాన్ని సమర్పించారు.



డెల్టాలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 4,900,మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,500 క్యూసెక్కుల నీటిని వదిలారు.

స్వర్ణ పతకాలు



సఖినేటిపల్లి: మండలానికి చెందిన బాలలు మేడంకి సుజల, మేడంకి రియాన్ ఇండో-నేపాల్ ఇంటర్నే షనల్ సిరీస్‌లో బంగారు పతకాలు సాధించారు.

న్యూస్‌రీల్

11న మినీ జాబ్‌మేళా

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్ ఆవరణలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) భవనంలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండల రావు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ మేళాకు ఎల్ఐసీ, సుస్వాదీప్, ఫ్లిప్‌కార్ట్ కంపెనీలు హాజరై, కంప్యూటర్ ఆపరేటర్, అడ్వైజర్, గోడౌన్ ఇన్‌చార్జి, డెలివరీ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలను భర్తీ చేస్తాయి. పది, ఇంటర్, డిగ్రీ పాసైన 19 ఏళ్ల నుంచి 38 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత కలవారు తమ పూర్తి వివరాలతో apssdc.in నందు రిజిస్టర్ కావాలి. లేదా నేరుగా వేదిక వద్ద రిజిస్టర్ కావచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 98487 29819, 91339 12947 నంబర్లను సంప్రదించాలి.

పోలీసు స్పందనకు 22 ఫిర్యాదులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనకు 22 ఫిర్యాదులు అందాయి. ఇన్‌చార్జి ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఏఎస్పీ స్పందనకు హాజరై అర్జీదారులతో మాట్లాడారు. సివిల్‌లో 12, కుటుంబ తగాదాలు 4, ఇతర విషయాలకు సంబంధించి 6 ఫిర్యాదులు అందాయి. జిల్లా పరిధిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 22 మంది ఫిర్యాదుదారుల అర్జీలను ఏఎస్పీ ఎం.రజనీ జోనల్ డీఎస్పీల సమక్షంలో స్వీకరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో విజిలెన్స్ తనిఖీలు



వేమగిరిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): అంగన్‌వాడీ కేంద్రాలపై విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. కడియం, కాకినాడ జిల్లా టి.రాయవరం, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆత్రేయపురం లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, నమోదైన గర్భిణులు, బాలింతలు, చిన్నారుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. సంపూర్ణ పోషణ పథకం, బాలామృతం, న్యూట్రిషియన్ కిట్ల పంపిణీ తీరుపై ఆరా తీశారు. తాగునీటి వసతి, పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది పని తీరు తదితర అంశాలను లోతుగా పరిశీలించారు. తమ పరిశీలనపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు ఇంచార్జ్ రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమార్ తెలిపారు. తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, జియాలజిస్ట్ లక్ష్మినారాయణ, హెడ్ కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుల్స్ వలీ, లోవకుమార్, కిషోర్, లోవరాజు పాల్గొన్నారు.

కిరణ్ కంటి ఆస్పత్రికి బస్సు బహూకరణ



డాక్టర్ చంద్రశేఖర్‌కు బస్సును అప్పగిస్తున్న అనంద్, శ్వేత దంపతులు. చిత్రంలో క్రికెటర్ శ్రీకర్ భరత్, కొడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి

కాకినాడ రూరల్: దేవరపల్లికి చెందిన పరమేసు బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎస్ఆర్ కింద కాకినాడ రూరల్ పెనుమర్తిలోని సంకురాత్రి ఫౌండేషన్‌కు సుమారు రూ.49 లక్షల విలువైన బస్సును సమకూర్చారు. సంస్థ ఎండీ ఆనంద్, జీఎం శ్వేత దంపతులు సోమవారం జరిగిన కార్యక్రమంలో బస్సును సంకురాత్రి వ్యవస్థాపకుడు చంద్రశేఖర్‌కు అందజేశారు. భారత క్రికెటర్ కోన శ్రీకర్ భరత్, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, ఫౌండేషన్ ట్రస్టీ కల్యాణ్ చక్రవర్తి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాత ఆనంద్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల ప్రజల వద్దకు వెళ్లి కిరణ్ కంటిఆస్పత్రి సిబ్బంది వైద్య సేవలు అందించేందుకు వీలుగా పరికరాలతో కూడిన బస్సును అందజేశామన్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ పరమేసు బయోటెక్ సంస్థ పెద్ద మనసును అభినందించారు. దాతలు ఆనంద్, శ్వేత దంపతులతో పాటు శ్రీకిరణ్ ఆస్పత్రి సీఎస్ఆర్ హెడ్ రాంప్రసాద్‌ను సత్కరించారు.

నిన్న సాయం.. నేడు అభయం

- ముఖ్యమంత్రి జగన్ నేడు రాక
- కోనసీమ వరద బాధిత ప్రాంతాల్లో పర్యటన
- ఇప్పటికే పూర్తయిన సాయం పంపిణీ
- లోటుపాట్లు తెలుసుకొనేందుకు వస్తున్న సీఎం
- లంకల్లో బాధితులతో ముఖాముఖి



రాజమహేంద్రవరంలో తమ ప్రియతమ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ/సాక్షి, అమలాపురం: గోదావరి వరద బాధితులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. ముమ్మిడివరం, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని వరద బాధితులతో నేరుగా మాట్లాడనున్నారు. వరద బాధితులకు ప్రభుత్వ సాయం అందిన తీరుతో పాటు వారి ఇబ్బందులను స్వయంగా తెలుసుకుని, మనోధైర్యం కల్పించనున్నారు. గోదావరి నదీ కోతను పరిశీలించి, బాధితులతో మాట్లాడతారు. సీఎం పర్యటనకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యాన పక్కా ఏర్పాట్లు చేశారు. సీఎం పర్యటించే మార్గం సింగిల్ రోడ్డు కావడంతో బయటి ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. సీఎం రాక కోసం తొలిసారిగా లంక గ్రామమైన గురజాపులంకలో హెలిపాడ్ ఏర్పాటు చేయడం విశేషం.

సహాయ, పునరావాసానికే ప్రాధాన్యం

వరద గోదావరి గత నెల 22న ఉగ్రరూపం దాల్చింది. ఆ తరువాత కాస్త నెమ్మదించినా.. రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యాక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని సుమారు 30 లంక గ్రామాలకు వరద పోటెత్తింది. ప్రజలు ముంపు బారిన పడ్డారు. వరద ముంపులో 10 రోజులకు పైనే లంక గ్రామాలున్నాయి. ఆ సమయంలో బాధితుల పరామర్శకు వస్తే ప్రభుత్వ సహాయ, పునరావాస కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. ముంపులో ఉన్న బాధితులందరికీ ప్రభుత్వ సాయం అందించి, ఆదుకోవడమే ఏకైక అజెండాగా కలెక్టర్ సహా మొత్తం ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. గతంలో మాదిరిగా మాటలు చెప్పి, ప్రచారం చేసుకునేలా వ్యవహరించ లేదు. మాటలు ఒకటి, చేతలు మరొకటి కాకుండా బాధితులకు తక్షణ సాయం అందించేందుకు వీలుగా యుద్ధప్రాతిపదికన కోనసీమ జిల్లాకు రూ.3 కోట్లు పైగా అందించారు. కేవలం నిధులు ఇచ్చి చేతులు దులుపుకోవడం కాకుండా.. గత పాలకులకు భిన్నంగా బాధితులందరికీ సాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా జిల్లా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. చివరి బాధితుల వరకూ సాయం చేరాలనే ఆదేశాలతో వలంటీర్ల నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకూ ప్రతి ఒక్కరూ సీఎం ఆదేశాలను తు.చ. తప్పకుండా అమలు చేస్తూ.. వరద బాధితులకు అండగా నిలిచారు.

గత పాలకులకు భిన్నంగా..

గతంలో వరదలు, ప్రకృతి విపత్తుల సమయంలో సాయం అందించినా.. అందించకున్నా ముఖ్యమంత్రి స్థాయిలో ని వ్యక్తి ఆర్భాటపు పరామర్శలతో ప్రచారం చేసుకోవడం అందరికీ తెలిసిందే. అందుకు భిన్నమైన రీతిలో స్పందించిన తొలి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధితుల హృదయాల్లో నిలిచి పోయారు. లంకల్లోని బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయం పూర్తిగా అందించిన తరువాతే ఆ ప్రాంతాల్లో పర్యటించాలని ముందుగానే నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే ముంపు బాధితులను స్వయంగా పలకరించి, వారికి ప్రభుత్వ సాయం ఏ మేరకు అందిందో స్వయంగా తెలుసుకునేందుకు కోనసీమ జిల్లా లంకల్లో పర్యటించనున్నారు. ప్రభుత్వ సాయంపై వారు సంతృప్తిగా ఉన్నారా లేక ఇంకా ఏవైనా లోటుపాట్లు ఉన్నాయా అనే విషయాలు తెలుసుకోనున్నారు. సాయం అందని వారు ఎవరైనా ఉన్నారా, పంట నష్టం ఏ మేరకు జరిగిందో తెలుసుకుంటారు. ఇటువంటి సందర్భాల్లో గత పాలకులు ముందుగానే నిర్దేశించిన ప్రాంతాలకు వెళ్లి, ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడే వారిని ఏర్పాటు చేసి, వారితోనే మమ అనిపించి వెళ్లిపోయేవారు. దీనికి భిన్నంగా నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించే గ్రామాలను గుర్తించడం వరకే అధికారులు పరిమితమయ్యారు.

సాయం అందించారిలా..

- ముంపు తగ్గి, ట్రాక్టర్లు వెళ్లడానికి మార్గం సుగమం అయిన వెంటనే వరద బాధితులందరికీ 25 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, లీటర్ పామాయిల్, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళా దుంపల చొప్పున అందజేశారు. అర్ధ రాత్రి వరకూ కూడా ఈ సాయం పంపిణీ చేయడం విశేషం. గత పాలకుల హయాంలో ఈవిధంగా సాయం అందించడానికి నాలుగైదు రోజుల నుంచి వారం రోజులు పట్టేది.
- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మూడో ప్రమాద హెచ్చరిక ప్రకటిస్తేనే కానీ గత ప్రభుత్వ హయాంలో బాధితులకు భోజనాలు, ఆహార పొట్లాలు అందించే వారు కాదు. ఈసారి రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిలోనే వీటిని అందజేయడం విశేషం.
- అలాగే, బాధితులు ఒక్కరే ఉంటే రూ.వెయ్యి, ఒకరికి మించి ఉంటే రూ.2 వేల చొప్పున వెంటనే ఆర్థిక సాయం కూడా పంపిణీ చేశారు. గతంలో ఎప్పుడూ ఈవిధంగా సాయం అందించలేదని బాధితులు ఆనందం వ్యక్తం చేశారు.

సీఎం పర్యటన సాగనుందిలా..

- ఉదయం 9.10: రాజమహేంద్రవరం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.
- 9.40: ముమ్మిడివరం మండలం గురజాపులంకకు రాక.
- 9.40 నుంచి 10.25: బాధితులతో మాటామంతి.
- 10.35 – 11.10: లంక ఆఫ్ ఠాణేలంక రామాలయంపేటలో బాధితులతో ముఖాముఖి.
- 11.20: అయినవిల్లి మండలం కొండుకుదురు, తొత్తరమూడి చేరిక.
- 11.20 – 11.50: తొత్తరమూడిపేటలో వరద బాధితులతో మాటామంతి.
- 11.50: తొత్తరమూడిపేట నుంచి గురజాపులంక చేరిక.
- మధ్యాహ్నం 12.15: హెలికాప్టర్‌లో తాడేపల్లికి పయనం.

వరద బాధితులకు అందించిన సాయం

బాధిత కుటుంబాలు	:26,064
ఆహార పొట్లాలు	:86,013
వాటర్ ప్యాకెట్లు	:2,13,000
ఉచిత బియ్యం	:651.600 మెట్రిక్ టన్నులు
కందిపప్పు	:26,064 మెట్రిక్ టన్నులు
బంగాళా దుంపలు	:26.064 మెట్రిక్ టన్నులు
పామాయిల్	:26,064 లీటర్లు
ఉల్లిపాయలు	:26,064 మెట్రిక్ టన్నులు
పాలు అర లీటర్	:32,000
కొవ్వొత్తుల ప్యాకెట్లు	:1,00,000

రాజమహేంద్రవరంలో సీఎంకు ఘన స్వాగతం

సాక్షి, రాజమహేంద్రవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సోమవారం సాయంత్రం ఘన స్వాగతం లభించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా, ఏలూరు జిల్లా గొమ్ముగూడెం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సీఎం హెలీకాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 6.24 గంటలకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. హెలీప్యాడ్ వద్ద మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించిన సీఎం హెలీప్యాడ్ నుంచి రోడ్డు మార్గంలో ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్నారు. స్వాగతం పలికిన వారిలో మంత్రులు చెల్లుబోయిన వేణు, తానేటి వనిత, కారుమూరి నాగేశ్వరరావు, పినిపే విశ్వరూప్, ఎంపీ మార్గాని భరత్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, తలారి వెంకట్రావు, సత్తి సూర్యనారాయణ రెడ్డి, కురసాల కన్నబాబు, జి.శ్రీనివాస్ నాయుడు, జ్యోతుల చంటిబాబు, రూడా చైర్మన్ మేడపాటి. షర్మిలా రెడ్డి, రాజమండ్రి రూరల్, సిటీ కో–ఆర్డినేటర్లు చందన నాగేశ్వర్, గూడూరి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, ఎస్పీ సీహెచ్.సుధీర్ కుమార్ రెడ్డి, జేసీ ఎన్.తేజ్ భరత్, మున్సిపల్ కమిషనర్, కె.దినేష్ కుమార్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ఆర్డీవో సీహెచ్ చైత్ర వర్షిణి ఉన్నారు.

నేడు కోనసీమ జిల్లా పర్యటన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోనసీమ జిల్లాలో మంగళవారం పర్యటించనున్నారు. కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం గురజపులంక, రామాలయపేట, అయినవిల్లి మండలం కొండుకుదురు గ్రామాల్లోని వరద బాధితులతో మాట్లాడుతారు. అనంతరం హెలీకాప్టర్‌లో తాడేపల్లికి బయలుదేరి వెళుతారు.

చేనేతను ఆదరిద్దాం



చేనేత కార్మికుడిని సత్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత

- కలెక్టర్ మాధవీలత
- ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం
- నేతన్నలకు సత్కారం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): చేనేత కార్మికుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పథకాలను అమలు చేస్తోందని కలెక్టర్ మాధవీలత అన్నారు. దానవాయిపేటలోని నేతబజార్‌లో సోమవారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించారన్నారు. జిల్లాలో రెండు క్లస్టర్ల ఏర్పాటు చేస్తున్నామని, వాటికి కేటాయించిన నిధులతో ఆయా సొసైటీల్లోని కార్మికుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. నేత కార్మికుల కుటుంబాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి ఆదరించాలని పిలుపు నిచ్చారు. జిల్లాలో 1,362 మంది నేత కార్మికులకు ప్రతినెలా రూ.2,750 చొప్పున పెన్షన్ అందిస్తున్నామన్నారు. జిల్లాలోని పులపర్తి సొసైటీలో రూ.120.50 లక్షల విలువైన ప్రాజెక్టుకు సంబంధించి 233 మంది లబ్ధిదారులకు రూ.24.67 లక్షలు, అలాగే మురమండ సొసైటీలో రూ.190.50 లక్షల విలువైన ప్రాజెక్టుకు సంబంధించి 557 మందికి రూ.53.67 లక్షలు మొదటి విడతగా విడుదలయ్యాయన్నారు. అనంతరం పలువురు చేనేత కార్మికులకు కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ బి.ధనుంజయ్, డివిజనల్ మార్కెటింగ్ ఆఫీసర్ కె.పెద్దిరాజు, డెవలప్‌మెంట్ అధికారి కె.కృష్ణభాస్కర్ పాల్గొన్నారు.

కస్టమ్స్ కమిషనర్‌గా సాధు నరసింహారెడ్డి



కస్టమ్స్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సాధు నరసింహారెడ్డి

కాకినాడ: ఆంధ్రప్రదేశ్ కస్టమ్స్ కమిషనర్‌గా సాధు నరసింహారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ కస్టమ్స్ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తోన్న ఆయనను పదోన్నతిపై కమిషనర్‌గా నియమించారు. కమిషనర్ హోదాలో సాధు నరసింహారెడ్డి కుటుంబ సభ్యులు సోమవారం అన్నవరం సత్యదేవుని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాకినాడ కస్టమ్స్ కమిషనరేట్‌లో డిప్యూటీ కమిషనర్లు కె.విజయ్‌కుమార్, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ వెంటారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు, సూపరింటెండెంట్లు, ఇతర ఉద్యోగులు కమిషనర్ సాధు నరసింహారెడ్డిని అభినందించారు. కాకినాడ చాంబర్ ఆఫ్ కామర్స్, కేఎస్‌పీఎల్, షిప్పింగ్ అసోసియేషన్ ప్రతినిధులు కస్టమ్స్ కమిషనర్‌ను కలసి అభినందనలు తెలిపారు.

టీడీపీ నేతలకు పోలీసు నోటీసులు

ద్వారకాతిరుమల: గోపాలపురం టీడీపీలో గ్రూపు రాజకీయాలు పోలీసులకు తలనొప్పిగా మారాయి. రెండు గ్రూపుల మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు, ఎటువంటి ఘటనలకు దారితీస్తాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రాకను పురస్కరించుకుని గోపాలపురం నియోజకవర్గ టీడీపీ ముఖ్య నేతలకు దేవరపల్లి పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ తరపున బరిలో నిలిచేందుకు మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజులు పోటీ పడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే టీడీపీలోని బలమైన వర్గం మద్దిపాటికి వ్యతిరేకంగా ఇప్పటికే పలుమార్లు బహిరంగ సమావేశాలు నిర్వహించింది. దాంతో ఈ రెండు గ్రూపుల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. మంగళవారం చంద్రబాబు రాకను పురస్కరించుకుని పార్టీ నేతలు దేవరపల్లి జంక్షన్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఆ సభలో రెండు వర్గాల నేతలు, వారి అనుచరులు ఒకరిపై ఒకరు వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించడం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదని పోలీసు నోటీసులో పేర్కొన్నారు. అనుమతి లేకుండా రెండు వర్గాలు బైక్ ర్యాలీలు నిర్వహించకూడదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగినా.. అవాంఛనీయ ఘటనలు జరిగినా తాము చేపట్టే చర్యలకు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.



పోలీసు నోటీసు U/S 149 Cr.p.c

To

Sri. Muppidi Venkateswara Rao,

Ex. MLA. Gopalapuram AC,

Devarapalli.

గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు దేవరపల్లి పోలీసులు ఇచ్చిన నోటీసు

ఇసుక.. ఇబ్బంది లేదిక

- జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు ప్రణాళిక
- గోదావరి వరద నేపథ్యంలో భారీగా డంపింగ్
- వర్షాకాలంలోనూ నిర్మాణ పనులకు సరఫరా




గోదావరిలో ఇసుక తీస్తున్న బోట్‌మెన్ సొసైటీ సభ్యులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నిర్మాణ పనులకు ఆటంకం కలగకుండా ఇసుకపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. గోదావరి వరదల నేపథ్యంలో ముందు జాగ్రత్తతో భారీగా స్టాక్‌పాయింట్ల వద్ద నిల్వ చేసింది. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణంగా గోదావరికి వరదలు వస్తాయి. వరదలకు లంక గ్రామాల్లో నీరు చేరుతుంది. దీంతో అక్కడ ఇసుకను తీయడం సాధ్యపడదు. పడవులపై తీసుకుని వచ్చే వారికి కూడా కష్టతరంగా మారుతుంది. గోదావరిలో నీటి ప్రవాహం ఎక్కువ ఉంటే రీచ్‌లలో ఇసుకను తీయడం ఇబ్బందికరం. ఇసుక లభ్యం కాకపోవడంతో భవన నిర్మాణాలకు ఆటంకం కలుగుతుంది. భవన నిర్మాణ కార్మికులకు పని లేకుండా పోతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ మాధవీలత సూచనల మేరకు ప్రభుత్వాధికారులు ప్రణాళిక రూపొందించారు. వర్షాలు ప్రారంభం కాక ముందే 9 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా నిల్వ చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రత్యేకంగా స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఎనిమిది ప్రాంతాల్లో ఇసుక నిల్వ చేస్తున్నారు. అక్కడ నుంచి కొనుగోలుదారులకు సరఫరా చేస్తున్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలకు..

జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీలలో ఇప్పటికే గృహ నిర్మాణాలు వేగమందుకున్నాయి. నాడు–నేడు కింద ఆసుపత్రులు, పాఠశాల భవనాలు పనులు కూడా చురుగ్గా జరుగుతున్నాయి. వీటి అవసరాల కోసం కూడా ఇసుక అవసరం. ఈ నిర్మాణాలకు ఇబ్బంది ఎదురుకాకుండా ఇసుక సరఫరా చేస్తున్నారు. జనవరి నుంచి జూలై వరకు 2,24,240 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా చేయగలిగారు. మరో పక్క బోట్‌మన్ సొసైటీలకు కూడా అనుమతి మంజూరు చేశారు. 89 సొసైటీల ద్వారా ఇసుకను తీస్తున్నారు. ఈసొసైటీల ద్వారా 23 స్టాక్ పాయింట్లకు ఇసుక పంపిస్తున్నారు. ఓపెన్ ఇసుక రీచ్‌ల నుంచి కూడా స్టాక్ పాయింట్ వద్దకు చేరవేస్తున్నారు.



జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

నిబంధనల ప్రకారం విక్రయాలు



జిల్లాలో ఇసుక కొరత లేకుండా చర్యలు చేపట్టాం. స్టాక్ పాయింట్ల వద్ద నిల్వలు ఉండేలా చూస్తున్నాం. వర్షాల వల్ల భవన నిర్మాణ కార్మికులు పని లేకుండా ఇబ్బంది పడుతుంటారు. వీరికి అలాంటి ఇబ్బంది రాకూడదని స్టాక్ పాయింట్‌ల నుంచి ఇసుకను సరఫరా చేస్తున్నాం. అధిక ధరలకు అమ్మినా, అక్రమ నిల్వలు చేసినా, లోడ్‌కి మించి అధికంగా తరలించినా చర్యలు తీసుకుంటాం.

– కె.మాధవీలత, కలెక్టర్

స్టాక్ పాయింట్లలో ఇసుక (మెట్రిక్ టన్నుల్లో)

స్టాక్ పాయింట్	మండలం	నిల్వ
చిడిపి	కొవ్వూరు	1,81,882
ఉసులుమర్రు	పెరవలి	1,14,690
పందలపర్రు	నిడదవోలు	1,58,190
పెండ్యాల	నిడదవోలు	1,77,920
కాపవరం	కొవ్వూరు	---
కాతేరు	రాజమహేంద్రవరం రూరల్	1,02,360
లాలాచెరువు	రాజమహేంద్రవరం అర్బన్	1,42,891
బుర్రిలంక-వేమగిరి	రాజమహేంద్రవరం రూరల్	1,61,21
		8,94,054

3న సామూహిక ఉచిత వివాహాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్థానిక కోరుకొండ రోడ్డులోని సింహాచలనగర్ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి క్షేత్రంలో వరాహలక్ష్మి నృసింహస్వామి ట్రస్ట్ (మధుభయ వేదాన్తాచార్య పీఠం ట్రస్ట్, శ్రీరంగం) ఆధ్వర్యాన సెప్టెంబర్ 3వ తేదీ ఆదివారం కల్యాణమస్తు పేరిట సామూహిక ఉచిత వివాహాలు నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం, నాగేశ్వరరావు తెలిపారు. ఆరోజు ఉదయం 10.39 గంటలకు సుముహూర్తం నిర్ణయించామన్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్తలతో కలిసి సోమవారం ఆలయ ప్రాంగణంలో ప్రధానార్చకుడు అవసరాల శ్రీకిరణాచార్యులు విలేకరులతో మాట్లాడారు. ఏడాదికి ఒక్కసారి వచ్చే ఈ బ్రహ్మముహూర్తంలో ఉచితంగా వివాహాలు స్వామివారి అనుగ్రహంతో జరిపిస్తున్నామన్నారు. వివాహం చేసుకునే వధూవరులకు బంగారు మంగళ సూత్రం, వెండిమట్టెలు, పెండ్లి వస్త్రాలు, తలంబ్రాలతో సహా పెళ్లి సామాగ్రి ఉచితంగా ఇస్తామన్నారు. అనంతరం స్వామివారి అన్నప్రసాదం అందజేస్తామన్నారు. వధువు తరపున పది మంది, వరుడు తరపున పది మంది హాజరవ్వవచ్చన్నారు. వివరాలకు 0883-2447979, 88978 69383 నంబర్లను సంప్రదించాలని సూచించారు. అలాగే ఆగస్టు 25న పరిస్థితులు అనుకూలిస్తే వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఆరోజు మధ్యాహ్నం మూడు గంటలకు సామూహిక లక్ష్మీనారాయణ పూజలు జరిపించాలని ధర్మకర్తలు భావిస్తున్నారన్నారు. పూజా ద్రవ్యాలన్నీ ఆలయం పక్షాన సమకూర్చి, లక్ష్మీదేవి రూపు కూడా ఇవ్వాలని సంకల్పించామన్నారు. సమావేశంలో రాపర్తి వెంకట శ్రీదేవి, శిఘాకొల్లి సీతారామాంజనేయులు, గొల్లపూడి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం


హతుడు దుర్గాప్రసాద్ (పాతచిత్రం)

శంఖవరం: వివాహేతర సంబంధం నిండు ప్రాణాన్ని బలికొంది. మండలంలోని కొంతంగి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్ బాబు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు మండలం రాచపల్లికి చెందిన పగడం దుర్గాప్రసాద్(21)కు, అదే గ్రామానికి చెందిన మహిళతో రెండేళ్ల నుంచి వివాహేతర సంబంధం ఉంది. ఉపాధి నిమిత్తం భర్త దూర ప్రాంతంలో ఉండటంతో ఆ మహిళ తన ఇద్దరు కుమార్తెలతో కలిసి కొంతంగిలోని పుట్టింటికి వచ్చింది. ప్రసాద్ కూడా రాచపల్లి నుంచి ఆదివారం రాత్రి కొంతంగి వచ్చాడు. వివాహేతర సంబంధం విషయంలో అతడు అల్లరి చేయడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ప్రసాద్‌ను మేడ పైకి తీసుకువెళ్లి, కళ్లల్లో కారం కొట్టి, హతమార్చారని అతడి బంధువులు ఆరోపిస్తున్నారు. కొడుకు మృతదేహాన్ని చూసి తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. సీఐ కిషోర్‌బాబు, అన్నవరం ఎస్సై వి.కిషోర్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హతుడికి తల్లి, పెళ్లి కావలసిన అన్న, చెల్లెలు ఉన్నారు.

ఫల ప్రదం

- ఏజెన్సీ సీతాఫలాలకు పెరిగిన మార్కెట్
- దివాన్ చెరువుకు తీసుకొచ్చి వ్యాపారం
- చాగల్నాడు ప్రాంతంలో తగ్గిన సాగు



రాజానగరం: సీతాఫలం.. రుచిలో ప్రత్యేకం. అందుకే అందరికీ అమితమైన ఇష్టం. ఈ మధుర ఫలాలకు ఒకప్పుడు చాగల్నాడు ప్రధాన కేంద్రం. ఇక్కడ లభించే సీతాఫలాలు రూపంలో ఆకర్షిస్తూ, రుచిలో మైమరపిస్తుంటాయి. ఈ కాలంలో వీటి కొనుగోలుకు అందరూ ఆసక్తి చూపుతూంటారు. రియల్ ఎస్టేట్ పుణ్యామా అని చాగల్నాడు ప్రాంతంలో సీతాఫలాల సాగు చాలా వరకూ తగ్గిపోయింది. దీంతో ఏజెన్సీ సీతాఫలాలను ఇక్కడకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం, రంగంపేట, గండేపల్లి, రాజమహేంద్రవరం రూరల్, కోరుకొండ మండలాలు చాగల్నాడు ప్రాంతంలోకి వస్తాయి. ఇక్కడ పండిన సీతాఫలాలను విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, అమలాపురం, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలతో పాటు దేశ రాజధాని ఢిల్లీ వరకూ బుట్టల్లో ప్యాక్ చేసి రవాణా చేసేవారు. జాతీయ రహదారిని అనుకుని ఉన్న దివాన్ చెరువు ఈ సీజన్లో సీతాఫలాల కొనుగోలు, అమ్మకందారులతో కిక్కిరిసిపోయేది. ఈ కారణంగానే ఈ ప్రాంతం పండ్ల విక్రయ కేంద్రంగా పేరొందింది. ఆ గ్రామం నేడు వివిధ రకాల పండ్ల హోల్‌సేల్ వ్యాపార కేంద్రంగా కూడా అభివృద్ధి చెందింది. దాదాపు 15 ఏళ్ల కిందట ఈ సీజన్‌లో (వంద ఫలాలు రూ.100 నుంచి రూ.150 ఉన్న రోజులు) దివాన్ చెరువు పరిసర ప్రాంతాల్లో రూ.3.5 కోట్ల వ్యాపారం జరిగేది. ఇప్పుడు రియల్ ఎస్టేట్ ప్రభావంతో ఇక్కడ తోటలు తగ్గిపోయాయి. ఫలితంగా ఏజెన్సీ ప్రాంతాల నుంచి సీతాఫలాలను తీసుకువచ్చి ఇక్కడ చాగల్నాడు మార్కెట్లో విక్రయిస్తున్నారు.

జూలై నుంచి అమ్మకాలు

ఏజెన్సీలో వర్షాలు అధికంగా కురుస్తుండటంతో జూన్ నెలాఖరు నుంచి అక్కడ సీతాఫలాలు లభిస్తుంటాయి. వీటిని స్థానిక వ్యాపారులు జూలై నుంచి ఇక్కడకు తీసుకువచ్చి విక్రయిస్తారు. అక్టోబర్ వరకూ వీటి దిగుబడి ఉండడంతో సుమారు రూ.8.50 కోట్ల వరకూ అమ్మకాలు జరుగుతున్నాయి. అక్టోబర్‌లో చాగల్నాడు ఫలాలు లభించినప్పటికీ మార్కెట్లోకి రాకుండానే తోటలోనే వాటి అమ్మకాలు జరిగిపోతూంటాయి. ఈవిధంగా సుమారు రూ.కోటిన్నర వరకూ స్థానిక ఫలాల అమ్మకాలు ఉంటాయి.


జాతీయ రహదారిపై సీతాఫలాల విక్రయాలు

ఆ రుచే వేరు

చాగల్నాడు సీతాఫలాలపై ఆధారపడిన చిరు వర్తకులు సీజన్‌లో ఖాళీగా ఉండలేక ఈ సమయంలో ఏజెన్సీలో విరివిగా దొరికే పండ్లను ఇక్కడకు తీసుకువచ్చి, సొమ్ము చేసుకుంటున్నారు. చాగల్నాడులో పండే సీతాఫలాలు పక్వానికొచ్చిన తరువాతే చెట్ల నుంచి కోస్తారు. దీంతో ఇవి కొనుగోలుదారులను ఆకట్టుకుంటాయి. నిల్వకు పనికిరావు. ప్రస్తుతం ఏజెన్సీ నుంచి వస్తున్న సీతాఫలాలు కాయలుగా ఉండి, నిల్వకు పనికి వస్తాయి. కొనుగోలు చేసి, ఇంటికి తీసుకువెళ్లిన తరువాత ఒక్కొక్కటిగా ముగ్గుతూంటాయి. ప్రస్తుతం ఏజెన్సీ సీతాఫలాలకు దళారులు చెప్పిందే ధరగా పలుకుతోంది. రాజానగరం నుంచి రాజమహేంద్రవరం వరకూ ఈ సీజన్‌లో సుమారు 3,500 మంది చిరు వ్యాపారులకు ఇవే జీవనాధారం. రోడ్డు పక్కన స్టాల్స్ ఏర్పాటు చేసి, కాయలను సైజుల వారీగా గ్రేడింగ్ చేసి, డజను రూ.200 నుంచి రూ.400 వరకూ విక్రయిస్తున్నారు.

అలవాటు మానుకోలేక..



సీజన్ వారీగా లభించే పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాం. సుమారు పాతికేళ్లుగా ఈ సీజన్‌లో సీతాఫలాలను విక్రయిస్తున్నాం. అలవాటైన ఈ పని వదులుకోలేక, మరో పని చేయలేక ఏజెన్సీలో సీతాఫలాలు కొనుగోలు చేసి, ఇక్కడ వ్యాపారం చేస్తున్నాం.

– చాట్ల తాతారావు, వెలుగుబంద, రాజానగరం మండలం

గిట్టుబాటు కావడం లేదు



రోజంతా సీతాఫలాల విక్రయాల కోసమే స్టాల్ పెట్టుకుని కూర్చుంటే దినసరి కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు. ఏజెన్సీ నుంచి వచ్చే కాయలను దళారులు చెప్పిన ధరకు కొనుగోలు చేసినా, విక్రయించే సమయంలో ఒక్కోసారి అయినకాడికే అమ్ముకోవాల్సి వస్తోంది.

– పసల సురేష్, కలవచర్ల, రాజానగరం మండలం

స్లూయిజ్ వద్ద మృతదేహం

సీతానగరం: బొబ్బిల్లంక – మిర్తిపాడు మధ్యన తొర్రిగెడ్డ కల్వర్టుపై నుంచి కాలువలో పడి గల్లంతయిన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్సై కె.చిరంజీవి కథనం ప్రకారం.. మిర్తిపాడుకు చెందిన పీతల శ్రీనివాస్ (35) ఈ నెల 5న కల్వర్టు వద్దకు వచ్చి ఎగురుతున్న చేపలను పట్టుకునే క్రమంలో ప్రమాదవశాత్తూ కాలువలో పడి కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న ఈత వచ్చిన ఇద్దరు వ్యక్తులు శ్రీనివాస్‌ను కాపాడేందుకు విఫల యత్నం చేశారు. రెండు రోజుల అనంతరం సోమవారం ఉదయం బొబ్బిల్లంక స్లూయిజ్ గేట్ల వద్ద శ్రీనివాస్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య నళిని, ఎనిమిదేళ్ల కుమారుడు సాత్విక్ రాజు, ఆరేళ్ల కుమార్తె ఆరాధ్య, తల్లి బూసమ్మ, తమ్ముడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గల్లంతైన యువకుని మృతదేహం లభ్యం

ఉప్పలగుప్తం: ఎస్.యానాం వద్ద సముద్ర తీరంలోని ఉన్న కట్టు కాలువలో గల్లంతయిన చిత్రి ముఖేష్‌కుమార్ (19) మృతదేహం లభ్యమైంది. అమలాపురం రూరల్ మండలం వన్నె చింతలపూడి కొత్త కాలనీకి చెందిన ముఖేష్ ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలసి కట్టు కాలువలో దిగి, ప్రవాహ వేగానికి కొట్టుకుపోయాడు. గల్లంతైన అతడి కోసం పోలీసులు, స్థానికులు వలల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం మృతదేహం తేలడంతో పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు


జగనన్న కాలనీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియ, దవులూరి దొరబాబు

సామర్లకోట: స్థానిక జగనన్న కాలనీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు వారం రోజుల ముందుగానే పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. ఈటీసీ లే అవుట్‌లోని జగనన్న కాలనీని ఆమె సోమవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటించే ఈ కాలనీలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంతో పాటు ప్రతి ఇంటికీ తాగునీటి కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలన్నారు. స్వాగత ద్వారం సమీపంలో ఖాళీ స్థలాలుండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ ప్రదేశంలో మూడో ఆప్షన్‌లో ఇళ్లు నిర్మించుకునేలా లబ్ధిదారులను ఒప్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నాటికి ప్రతి స్థలంలో ఇల్లు ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, జేసీ ఇలక్కియ, హౌసింగ్ పీడీ పట్నాయక్, మెప్మా పీడీ ప్రియంవద, పెద్దాపురం ఆర్డీఓ జె సీతారామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలిండియా కిక్ బాక్సింగ్‌లో 'నన్నయ'కు రెండో స్థానం


జ్యోతికుమారికి జ్ఞాపిక, సర్టిఫికెట్లు అందజేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ వుమెన్ కిక్ బాక్సింగ్ పోటీల్లో ఆదికవి నన్నయ యూనివర్సిటీకి రెండో స్థానం దక్కింది. ఉత్తర ప్రదేశ్‌లోని బహదూర్‌సింగ్ పూర్వాంచల్ యూనివర్సిటీలో జరిగిన ఈ పోటీల్లో ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల విద్యార్థిని కె.జ్యోతికుమారి ద్వితీయ స్థానం సాధించి, సిల్వర్ మెడల్ అందుకుంది. వర్సిటీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జ్యోతికుమారిని ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు సత్కరించారు. వర్సిటీ ద్వారా రూ.20 వేల నగదు అవార్డు, సర్టిఫికెట్లు అందజేశారు. జ్యోతికుమారి క్రీడలతో పాటు ఎన్‌సీసీ కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొంటోంది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, జ్యోతికుమారి తల్లి నాగమణి, కోచ్ వి.అంజిబాబు, బాక్సింగ్ అఫీషియల్స్ సీహెచ్ చంద్రశేఖర్, ఎం.భవానీ శంకర్, పి.నాగరాజు, ఎ.ధర్మేంద్ర, స్పోర్ట్స్ బోర్డ్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.సుబ్బారావు, కార్యదర్శి డాక్టర్ బి.రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన వ్యక్తి

గండేపల్లి: మండలంలోని మురారి శివారున డివైడర్ సమీపంలో విశాఖ వైపు నడచి వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి(45)ని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని రోడ్డు సేఫ్టీ వాహన సిబ్బంది టి.అప్పారావు, ఏఎస్ స్వామి హుటాహుటిన గండేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందాడు. అతడిని ట్యాంకర్ ఢీకొని వెళ్లిపోయిందని స్థానికులు చెబుతున్నారు. మృతుడి చేతిలోని సంచిపై నర్సీపట్నం అని ఉండటంతో ఆ ప్రాంతానికి చెందిన వ్యక్తి కావచ్చని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశం రాజానగరం మండల పరిధిలోకి వస్తోందని, అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చామని గండేపల్లి పోలీసులు తెలిపారు.

భవనం నుంచి పడి కార్మికుడి మృతి

కొవ్వూరు: నిర్మాణంలో ఉన్న భవనానికి రంగులు వేస్తున్న ఓ కార్మికుడు కింద పడి మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబూరావు కథనం ప్రకారం.. పట్టణంలోని వేములూరు రోడ్డులో అవంతీ ఫీడ్స్ ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న ప్రాంతంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. భవనానికి రంగులు వేస్తున్న కొత్తమాసు నరసింహమూర్తి ప్రమాదవశాత్తూ కాలు జారి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయం అవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి కుమారుడు అచ్యుత రామారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లీబిడ్డల కోసం విస్తృత గాలింపు

- పోలీసుల అదుపులో నిందితుడు
- పెద్దమ్మకు లక్ష్మీ సాయి కీర్తన అప్పగింత


నిందితుడు ఉలవ సురేష్ (పాతచిత్రం)

అమలాపురం టౌన్/రావులపాలెం: సహ జీవనం చేస్తున్న మహిళను, కుమార్తెను గౌతమీ గోదావరిలోకి తోసేసిన ఘటనలో తల్లీబిడ్డల కోసం గాలింపు కొనసాగుతోందని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ తెలిపారు. డయల్ 100 కాల్‌తో స్పందించిన పోలీసులు ఈ ఘటనపై లోతైన దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. అమలాపురంలోని తన కార్యాలయంలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. తనతో సహ జీవనం సాగిస్తున్న తాడేపల్లికి చెందిన మహిళ సుహాసినితో పాటు కుమార్తెలు లక్ష్మీసాయి కీర్తన, ఏడాది పాప జెర్సీని ప్రకాశం జిల్లా దర్శికి చెందిన ఉలవ సురేష్ ఆదివారం వేకువజామున రావులపాలెం వంతెనపై నుంచి గోదావరిలోకి నిర్దాక్షిణ్యంగా తోసేసిన సంగతి తెలిసిందే. ఈ దారుణ ఘటనలో సుహాసిని, జెర్సీ గోదావరిలో పడి, గల్లంతవగా, కీర్తన వంతెన కేబుల్ పైపు పట్టుకుని 100 నంబర్‌కు సమాచారం ఇవ్వడం, ఆ బాలికను పోలీసులు రక్షించడం విదితమే. గోదావరిలో గల్లంతైన సుహాసిని, జెర్సీల కోసం రావులపాలెం, ఆలమూరు పోలీసులు రెండు ప్రత్యేక బోట్లతో గౌతమీ గోదావరిలో విస్తృతంగా గాలిస్తున్నారని ఎస్పీ శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఉదయం నుంచీ గాలింపు సాగుతోందని, సోమవారం సాయంత్రం వరకూ వారి ఆచూకీ తెలియరాలేదని చెప్పారు. ఈ ఘాతుకానికి పాల్పడిన సురేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఎస్పీ తెలిపారు.


తల్లీబిడ్డల కోసం గౌతమి గోదావరిలో గాలిస్తున్న పోలీసులు

పెద్దమ్మను రప్పించి..

కాగా, ఈ ఘటనలో రక్షించిన పదమూడేళ్ల లక్ష్మీ సాయి కీర్తనను పోలీసులు సోమవారం ఆమె పెద్దమ్మకు అప్పగించారు. గల్లంతైన సుహాసినికి తెనాలి చించుపేటకు చెందిన పిండం సుజాత సొంత అక్క. కీర్తన ఇచ్చిన ఆధారాలతో సుజాతను రావులపాలెం రప్పించామని ఎస్సై ఎం.వెంకటరమణ తెలిపారు. ఇదిలా ఉండగా ప్రకాశం జిల్లా దర్శికి చెందిన నిందితుడు ఉలవ సురేష్ విజయవాడ భవానీపురంలో తనకు తెలిసిన వారి వద్ద కారు అద్దెకు తీసుకున్నట్టు పోలీసులు చెబుతున్నారు. సుహాసినిని, తమ కుమార్తె జెర్సీని, ఆమె కుమార్తె లక్ష్మీ సాయి కీర్తనను ఆ కారులోనే ఎక్కించుకుని రావులపాలెం తీసుకువచ్చారని అంటున్నారు. ఆ కారు నెల్లూరుకు చెందిన ఒక వ్యక్తి పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్టు తెలుస్తోంది.

యువకుడి దుర్మరణం

అనపర్తి: స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. అనపర్తికి చెందిన వి.శ్రీను (29) ఆదివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై మితిమీరిన వేగంతో వెళ్తూ, రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఫుట్‌పాత్‌ను, రైలింగ్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయమవడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి వీరరాఘవ ఫిర్యాదు మేరకు ఎస్సై పి.అప్పారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఏడాది జైలు

రామచంద్రపురం: దొంగతనం కేసులో ముద్దాయిలకు కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. ఎస్సై బి.సురేష్‌బాబు కథనం ప్రకారం.. ఒక దొంగతనం కేసులో పట్టణానికి చెందిన కె.సూర్యమణికంఠ, కె.సత్యప్రభుకిరణ్‌లను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముద్దాయిలపై నేరం రుజువు కావడంతో ఏజేఎఫ్‌సీఎం జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్ సోమవారం తీర్పు ఇచ్చారని ఎస్సై తెలిపారు. ఏపీపీ బి.రామతులసి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

టీడీపీ 'కుళ్లు' రాజకీయం

- పిఠాపురం మున్సిపల్ ఆఫీసు వద్ద చెత్త వేసిన వర్మ
- ఘాటుగా స్పందించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- వర్మ చిత్రపటానికి మురికి నీటితో అభిషేకం

పిఠాపురం: టీడీపీ 'కుళ్లు' రాజకీయాలకు తెర లేపింది. నిరసన పేరుతో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ మంగళవారం మురికి కాలువల్లోని మురికి, చెత్త తెచ్చి మున్సిపల్ కార్యాలయం వద్ద వేశారు. ఈ సంఘటన పట్టణ ప్రజల్లో ఆగ్రహానికి కారణమైంది. గడప గడపకూ మన ప్రభుత్వం కింద సచివాలయాలకు విడుదల చేసిన నిధులతో పట్టణంలోని మురికి కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఇటీవల అధికారులను ఆదేశించారు. తక్షణమే కాలువలను గుర్తించాలన్నారు. నెల రోజులుగా మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి పర్యటించి వర్షాలకు ప్లాస్టిక్ వ్యర్థాలు చేరి, కాలువలు మూసుకుపోయి సమస్య ఉత్పన్నమవుతోందని గుర్తించారు. ఆయా కాలువల అభివృద్ధికి పనులు చేపట్టారు.

ఏ పని చేస్తూంటే దానిపై ఆందోళన

ప్రభుత్వం ఏ మంచి పని చేసినా బురద జల్లి ఆందోళన చేయడం.. పని పూర్తి అవ్వగానే తమ వల్లేనంటూ గొప్పలు చెప్పుకోవడం టీడీపీ నాయకులకు పరిపాటిగా మారింది. ఇందులో భాగంగానే మురికి కాలువల అభివృద్ధి పనులు చేస్తూంటే.. మరోపక్క ఆ పార్టీ నాయకుడు వర్మ వార్డుల్లో తిరుగుతూ మురికి కాలువలు శుభ్రం చేయడం లేదంటూ విమర్శిస్తున్నారు. ప్రధాన కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకున్నా ఏమీ పట్టించుకోవడం లేదంటూ కాలువల మురికిని వాహనాలపై తెచ్చి స్వయంగా మున్సిపల్ కార్యాలయం ముందు వేశారు. ఎమ్మెల్యే దొరబాబుపై విమర్శలు గుప్పించారు.


మున్సిపల్ కార్యాలయంపై మురికి వేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

మండిపడిన కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ శ్రేణులు


వర్మ తీరుపై మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మండిపడ్డారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. బాధ్యత గల నాయకుడు ఇలా మూర్ఖంగా మురికిని తెచ్చి కార్యాయం వద్ద వేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన తెచ్చిన మురికితోనే వర్మ చిత్రపటానికి అభిషేకం చేశారు. వర్మపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని నినదించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ, వర్మకు పిచ్చి ముదిరి ఇలాంటి పనులు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆయన ఐదేళ్ల పాలనలో పట్టణ పారిశుధ్యాన్ని గాలికొదిలేశారన్నారు. మురికి తెచ్చి ఇక్కడ వేయడం నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని వైఎస్సార్ సీపీ శ్రేణులకు సర్ది చెప్పి, ఆందోళన విరమింపజేశారు.


వర్మ చిత్రపటానికి మురికితో అభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

18 మందిపై కేసు

మున్సిపల్ కార్యాలయంపై దౌర్జన్యంగా మురికి వేసిన మాజీ ఎమ్మెల్యే వర్మ సహా 18 మందిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు తెలిపారు. మున్సిపల్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీ నేతలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.


ముంపు పంటలను రక్షించుకోండిలా..


జి.కోటేశ్వరరావు

పాడి-పంట

ఆలమూరు: ఇటీవలి గోదావరి వరదలతో ముంపునకు గురైన కూరగాయ పంటలను రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటే రక్షించుకోవచ్చని ఆలమూరు మండల ఉద్యాన అధికారి జి.కోటేశ్వరరావు చెబుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సీతానగరం, రాజమహేంద్రవరం రూరల్, తాళ్లపూడి, కొవ్వూరు, పెరవలి, కడియం, ఆలమూరు, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రాజోలు, పి.గన్నవరం, మామిడికుదురు, అల్లవరం, సఖినేటిపల్లి తదితర మండలాల్లో వరదలో చిక్కుకున్న కూరగాయ పంటలను కాపాడుకొనేందుకు సరైన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

- భూమి వాలును అనుసరించి పొలాల్లోని వరద నీరు పోయేలా అరడుగు వెడల్పున కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. వరద నీరు ఇంకిన తరువాత నేలను పొడిగా ఆరనివ్వాలి.
- నీరు ఎక్కువ రోజులుంటే జింక్, పొటాష్, నత్రజని పోషకాలతో పాటు ఇనుము ధాతు లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది. జింక్ లోప నివారణకు 0.2 శాతం జింక్ సల్ఫేట్, ఇనుము ధాతు లోప నివారణకు 0.2 శాతం ఫెర్రస్ సల్ఫేట్, పొటాష్, నత్రజని లోపాల నివారణకు పంట దశను అనుసరించి 0.5 శాతం నుంచి 1.0 శాతం వరకూ పొటాష్ నైట్రేట్‌ను పిచికారీ చేయాలి.
- ముంపులో చిక్కుకున్న కూరగాయ పంటలకు తెగుళ్లు సోకకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. రసం పీల్చే పురుగు నివారణకు 2 మిల్లీలీటర్ల ఫిప్రోనిల్ లేదా ప్రొఫెనోఫాస్ మందు లేక 3 మిల్లీలీటర్ల ఇమిడాక్లోప్రిడ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- టమాటాలో ఆకుముడత తెగులు నివారణకు టెబ్యుకోనజోల్ 2 మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కాయ కుళ్లు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ ఒక గ్రాము మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- వంగలో మొవ్వకుళ్లు, కాండం తొలుచు పురుగు నివారణకు మూడు గ్రాముల కార్బరిల్ మందును లేదా 2 మిల్లీలీటర్ల ప్రొఫెనోఫాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ఆకుకూరల్లో ఆకుమచ్చ తెగులు నివారణకు ఒక గ్రాము కార్బన్‌డైజిమ్ లేదా రెండు గ్రాముల కార్బన్‌డైజిమ్‌తో పాటు మాంకోజెబ్ మందు కలిపి లీటరు నీటిలో పిచికారీ చేయాలి.
- వరద నీరు నిల్వ వలన దొండపాదుల్లో చల్లని వాతావరణం ఏర్పడుతుంది. దీనివల్ల బూజు, బూడిద తెగుళ్లు ఆశించే ప్రమాదముంటుంది. బూజు తెగులు నివారణకు మాంకోజెబ్ లేదా మెటాలాక్సిల్ 2 మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. బూడిద తెగులు నివారణకు ట్రి డీమార్ఫ్ లేదా డైనోకాప్ ఒక మిల్లీలీటరు మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.


వరద ముంపులో కూరగాయ పంటలు (పాతచిత్రం)